Janampower.in
TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక
JANAM POWER

కరీంనగర్ Karimnagar | శనివారం Saturday | 02.05.2026 02.05.2026 | సంపుటి : 14 Valume : 14 | సంచిక : 321 Issue : 321 | పేజీలు: 10 వెల: 5/- Pages : 10 Cost: 5/-



Editor: BANDARI MARUTHI



## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు జూన్ 2తో మోక్షం

ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో పాటే కేటాయింపు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్.. వెల్లడించిన మంత్రి పొంగులేటి

2

## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు



ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కింద డీజీపీ, మాజీ డీజీపీ, ట్రాఫిక్ జాయింట్ సీపీకి నోటీసులు ఇచ్చింది.

3

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం



- ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్న కారు
- ఆరుగురు అక్కడికక్కడే మృతి.. మరొకరి పరిస్థితి విషయం
- మృతులంతా యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ప్రమాదం

వివరాలు 2వ పేజీలో



## నేర నియంత్రణలో టెక్నాలజీ వినియోగం

- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్
- డ్రగ్స్ నియంత్రణకు మరింత కఠిన చర్యలు
- డీజీపీగా సీవీ ఆనంద్ ప్రమాణస్వీకారం

తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు.

2

## కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్య
- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్
- మేడే ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



3

# ఆర్టీసీ కార్మికులకు శుభవార్త

### సమ్మె కాలానికి వేతనం.. కేసుల ఎత్తివేత

కార్మిక సంఘాల విజ్ఞప్తిపై సీఎం సానుకూల నిర్ణయం

వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నంకు ఆదేశం





ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించిన సమ్మె కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించడంతో పాటు ఆ సమయంలో వారిపై నమోదైన పోలీసు కేసులను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు.

**హైదరాబాద్, మే 1:** రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఉదారత చాటుకున్నారు. ఇటీవల 3 రోజుల పాటు నిర్వహించిన సమ్మె కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఆ సమయంలో వారిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని నిర్ణయించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ఆయనను కలిసిన సందర్భంగా ఈ కీలక ప్రకటన వెలువడింది. తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిన సీఎంకు కార్మిక

మిగతా 2 లో

## ఆర్టీసీకి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం

- త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు
- మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం



2

## భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

- 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం



వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది.

## ఇరాన్‌తో యుద్ధాన్ని ఆపేశాం



- వైట్ హౌస్ సంచలన ప్రకటన
- అమెరికా చట్టసభలకు ట్రంప్ సర్కారు లేఖ
- 60 రోజుల గడువు ముగియడంతోనే ఎత్తుగడ
- కాంగ్రెస్ అనుమతి నుంచి తప్పించుకునే వ్యూహం

ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణల విషయంలో అమెరికా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్ తో తాము యుద్ధాన్ని ఆపేశామని వైట్ హౌస్ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు అమెరికా చట్టసభకు (కాంగ్రెస్‌కు) ఒక అధికారిక లేఖను పంపింది. పశ్చిమాసియాలో ఇప్పటికీ అమెరికా దళాలు పెద్ద సంఖ్యలో మోహరించి ఉన్నప్పటికీ.. వైట్ హౌస్ అకస్మాత్తుగా ఈ ప్రకటన చేయడం అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది.

2



## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు
# జూన్ 2తో మోక్షం

**ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో పాటే కేటాయింపు**

**రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్.. వెల్లడించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, మే 1:** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, జూన్ 2వ తేదీ నాటికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీతో పాటు ఇతర జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో ఆయన సుదీర్ఘంగా సమావేశమయ్యారు. న్యాయపరమైన చిక్కుల్లేకుండా, ఎలాంటి విమర్శలకు తావులేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సంక్షేమం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని మంత్రి తెలిపారు. 'ఫ్యూచర్ సిటీ'లో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో సమానంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ముఖ్యమంత్రి అంగీకరించినట్లు పొంగులేటి వెల్లడించారు. 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం చూస్తున్నా, న్యాయ వివాదాల వల్ల అది మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. జూన్ 2 నాటికి ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులందరూ ఒకే తాటిపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం ఉన్న మూడు ప్రధాన సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సంఘాల్లో సభ్యులు కాకపోయినా, అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. గతంలో 18 ఏళ్ల క్రితమే స్థలాల కోసం జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీ సభ్యులు ఒక్కొక్కరు రూ. 2 లక్షలు చెల్లించారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమకు ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరగా, దానిపై సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## సేంద్రియ సాగుకు సర్కారు దన్ను

**మే 4న 'టీజీ ఆర్గానిక్స్' యాప్ ప్రారంభం**

**హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ రంగంలో సేంద్రియ సాగును మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. సేంద్రియ రైతులు పండించిన పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు 'టీజీ ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను మే 4వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రసాయన ఎరువులు లేని నాణ్యమైన ఆహారాన్ని నేరుగా రైతుల వద్ద నుండే కొనుగోలు చేసే వెసులుబాటును ఈ యాప్ కల్పిస్తోంది. నేటి కాలంలో రసాయన ఎరువుల వాడకం వల్ల ఆహారం విషతుల్యమవుతున్న తరుణంలో, సేంద్రియ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరుగుతోంది. అయితే మార్కెట్‌లో సరైన గుర్తింపు, నాణ్యతా ప్రమాణాలు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ ద్వారా సర్టిఫికేట్లు పొందిన రైతుల వివరాలను మాత్రమే ఈ యాప్‌లో పొందుపరిచారు. దీనివల్ల వినియోగదారులకు కల్తీలేని ఆహారం లభించడమే కాకుండా, రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది. ఈ యాప్‌లో సేంద్రియ రైతు పేరు, మొబైల్ నంబర్, చిరునామా, లొకేషన్ వివరాలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా రైతు వద్ద ఉన్న వివిధ రకాల సేంద్రియ ఉత్పత్తుల సమాచారాన్ని కూడా ఇందులో పొందుపరిచారు. ఉత్పత్తుల ధరను నిర్ణయించే అధికారం కేవలం రైతుకే ఉంటుంది కాబట్టి, వినియోగదారులు నేరుగా రైతును సంప్రదించి ధర విషయాలను చర్చించుకోవచ్చు. ప్రస్తుతం దాదాపు 500 మంది రైతులు ఈ యాప్‌లో నమోదు చేసుకోగా, సుమారు 100కు పైగా సేంద్రియ ఉత్పత్తులను కస్టమర్ల కోసం సిద్ధంగా ఉంచారు. ఏకలవ్య ఫౌండేషన్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ వంటి సంస్థల ద్వారా ధృవీకరణ పొందిన రైతుల వివరాలను కూడా ఇందులో చేర్చారు. రసాయన సాగు వల్ల పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను తగ్గించి, ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకువస్తోంది. తెలంగాణ సేంద్రియ సాగులో ఈ యాప్ ఒక నూతన విప్లవానికి నాంది కానుందని నిపుణులు భావిస్తున్నారు.

## ఇరాన్‌తో యుద్ధాన్ని ఆపేశాం

**వైట్ హౌస్ సంచలన ప్రకటన.. అమెరికా చట్టసభలకు లేఖ**



**వాషింగ్టన్:** ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణల విషయంలో అమెరికా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌తో తాము యుద్ధాన్ని ఆపేశామని వైట్ హౌస్ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు అమెరికా చట్టసభకు (కాంగ్రెస్ కు) ఒక అధికారిక లేఖను పంపింది. పశ్చిమాసియాలో ఇప్పటికీ అమెరికా దళాలు పెద్ద సంఖ్యలో మోహరించి ఉన్నప్పటికీ.. వైట్ హౌస్ అకస్మాత్తుగా ఈ ప్రకటన చేయడం అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం ఇరాన్ తో కాల్పుల విరమణ అమలులో ఉన్నందున, అధికారికంగా యుద్ధం ముగిసినట్లేనని డొనాల్డ్ ట్రంప్ సర్కారు గట్టిగా వాదిస్తోంది. అయితే, ఈ ప్రకటన వెనుక ఉన్న అసలు కారణం చట్టపరమైన చిక్కుల నుంచి బయటపడటమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా రాజ్యాంగంలోని 1973 వార్ పవర్స్ రిజల్యూషన్ (సైనిక చర్యలపై అధ్యక్షుడి అధికారాలను నియంత్రించే చట్టం) ప్రకారం.. విదేశాల్లో సైనిక చర్యలు చేపట్టిన 60 రోజుల లోపు అధ్యక్షుడు తప్పనిసరిగా కాంగ్రెస్ అనుమతి తీసుకోవాలి. ఒకవేళ చట్టసభల అనుమతి లభించకపోతే తక్షణమే యుద్ధాన్ని ఆపేయాలి. బలగాల ఉపసంహరణ కోసం భద్రతా కారణాల దృష్ట్యా మరో 30 రోజుల అదనపు గడువు మాత్రమే కోరే అవకాశం ఉంటుంది. ఈ చట్టపరమైన గడువు నుంచి తప్పించుకునేందుకే ట్రంప్ సర్కారు ఈ సరికొత్త లీగల్ వ్యూహాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. యుద్ధం ఇప్పటికే ముగిసిపోయింది కాబట్టి.. ఇక కొత్తగా కాంగ్రెస్ అనుమతి అవసరం లేదనేది వైట్ హౌస్ ప్రధాన వాదన. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్ తో కలిసి అమెరికా దళాలు ఇరాన్ పై సంయుక్తంగా గగనతల దాడులు ప్రారంభించాయి. ఆ దాడులు జరిగిన 48 గంటల లోపే డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ఈ ఘర్షణల గురించి కాంగ్రెస్ కు సమాచారం అందించారు. అప్పటినుంచి లెక్కవేసుకుంటే మే ఒకటో తేదీతో సరిగ్గా 60 రోజుల గడువు ముగిసింది. చట్టసభల్లో చర్చకు వస్తే ఎదురయ్యే వ్యతిరేకతను, ఇతర రాజకీయ పరిణామాలను నివారించేందుకే గడువు ముగిసిన వెంటనే తెలివిగా 'యుద్ధం ముగిసింది' అనే ప్రకటన చేశారని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికులకు సీఎం శుభవార్త



మొదటి పేజీ తరువాయి

సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ఇటీవల మూడు రోజుల పాటు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో కార్మికులు తమ సమ్మెను విరమించి విధుల్లో చేరారు. ఈ క్రమంలోనే సమ్మె కాలానికి సంబంధించిన మూడు రోజుల వేతనాన్ని మంజూరు చేయాలని, ఆందోళనల సమయంలో పెట్టిన కేసుల నుంచి ఉపశమనం కలిగించాలని కార్మిక నేతలు ముఖ్యమంత్రిని కోరారు. వారి అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన సీఎం, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వేతనాల చెల్లింపునకు, కేసుల ఎత్తివేతకు తక్షణమే అంగీకరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను వేగవంతం చేసే బాధ్యతను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులకు అప్పగించారు. సమ్మె కాలపు వేతనం అందజేయడంతో పాటు కేసుల ఎత్తివేతకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆర్టీసీకి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం**

**త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు**

**మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్**



**సిద్దిపేట, మే1:** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరి వారు సమ్మె పట్టించుకోకుండా ఉండలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు. ఈ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించామని స్పష్టం చేశారు. త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియను గుర్తింపు పొందిన సంఘం అధికారుల కమిటీ పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామని అన్నారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, కేబినెట్ మంత్రులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 380 రూట్‌లలో కొత్తబస్సులు నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. 7 లక్షల మంది ప్రయాణికులకు కనెక్టివిటీ పెంచామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రిగా.. ప్రభుత్వానికి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఏవిధంగా పోరాడామో సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్
- డ్రగ్స్ నియంత్రణకు మరింత కఠిన చర్యలు
- డీజీపీగా సీవీ ఆనంద్ ప్రమాణస్వీకారం



**హైదరాబాద్, మే 1:** తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయ-బోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్న కారు
- ఆరుగురు అక్కడిక్కడే మృతి..
- మరొకరి పరిస్థితి విషయం
- యాదగిరిగుట్టు వెళ్లి వస్తుండగా ప్రమాదం



**హైదరాబాద్, మే 1:** శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బయటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

**పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు**

**హైదరాబాద్, మే 1 :** ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం



- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు
- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్
- మేడే ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మే 1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించకుండా ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.సఫాయిల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్థత వల్ల ఎస్-ఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ' తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# టెండర్లలో భారీ స్కామ్: రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల భారం

**25 శాతం వరకు ఎక్సెస్ టెండర్లు..**

**హ్యామ్ రోడ్ల అవినీతి నిజమైందన్న హరీశ్ రావు**

**తాగునీటి కష్టాలపై సర్కారుపై విమర్శలు..**

**మిషన్ భగీరథను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు**



**హైదరాబాద్, మే 1:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రహదారి నిర్మాణ టెండర్లలో భారీ కుంభకోణం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో తాను హెచ్చరించిన 'హ్యామ్' రోడ్ల స్కామ్ ఇప్పుడు అక్షరాలా నిజమైందని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల్లో పిలిచిన టెండర్లు 22 నుంచి 25 శాతం వరకు ఎక్సెస్‌కు వెళ్లడం ప్రభుత్వ దోపిడీకి నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఆర్అండ్బీ శాఖలో రూ. 11 వేల కోట్ల పనులకు గాను వ్యయం రూ. 15 వేల కోట్లకు పెరిగిందని, అలాగే పంచాయతీ రాజ్ శాఖలో రూ. 6 వేల కోట్ల టెండర్లు రూ. 8 వేల కోట్లకు చేరుతున్నాయని హరీశ్ రావు గణాంకాలతో వివరించారు. జాతీయ రహదారుల టెండర్లు తక్కువ ధరకు (డిస్కౌంట్) జరుగుతుంటే, రాష్ట్రంలో మాత్రం అదనపు భారం పడటం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ టెండర్లలో 40 శాతం ప్రభుత్వం భరిస్తుంటే, మిగిలిన 60 శాతం కాంట్రాక్టర్లు బ్యాంకు రుణాల ద్వారా తెస్తారని, వీటికి ప్రభుత్వం సావరిన్ గ్యారెంటీ ఇస్తోందని తెలిపారు. ఈ 15 ఏళ్ల రుణ భారం చివరకు ప్రజలపైనే పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత టెండర్లలో ఒకే కంపెనీకి ఏకంగా 15 ప్యాకేజీలు దక్కబోతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు వాటిని ఎలా సమర్థిస్తున్నారని నిలదీశారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి, మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు లేకుండా మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్డ్ అధికారులకు ఎక్స్‌టెన్షన్‌లు ఇచ్చి తప్పుడు పనులు చేయిస్తున్నారని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో తాగునీటి కష్టాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో 'మిషన్ భగీరథ' ద్వారా ఇంటింటికీ నల్లా నీరు ఇచ్చామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని కేసీఆర్‌పై కోపంతో నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పథకాలు, పైపులు ఉన్నా నీళ్లు రాకపోవడంతో పల్లెలు, పట్నాలు అనే తేడా లేకుండా ప్రజలు ట్యాంకర్లు, బిందెలతో రోడ్లపైకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్ధాల ప్రవాహం ఆపి, మిషన్ భగీరథ పైపుల్లో నీళ్లు పారించి ప్రజల కష్టాలు తీర్చాలని ఆయన హితవు పలికారు.

# గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

**ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం**

**కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, మే 1:** కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# కార్మికుల హక్కుల పరిరక్షణే మా లక్ష్యం

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మే డే వేడుకలు**

**వచ్చే ఏడాది నుంచి కార్మికులకు 'పీజేఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు**



**హైదరాబాద్, మే 1:** రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం మేడే పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అధికారిక ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు 'శ్రమశక్తి' అవార్డులను అందజేసి వారిని గౌరవించారు. కార్మికుల భద్రత, సంక్షేమం విషయంలో యాజమాన్యాల దృక్పథంలో మార్పు రావాలని, వారు మరింత కృషి చేయాలని మంత్రి సూచించారు. రాహుల్ గాంధీ సూచనల మేరకు రాష్ట్రంలోని 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు భద్రత కల్పిస్తున్నామని, ఇందుకు సంబంధించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. యువతలో నైపుణ్యం పెంచి ఉపాధి కల్పించేందుకు టాటా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని 120 ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు రూ. 4 వేల కోట్లతో ఈ శిక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయని, ఇందులో విద్యార్థులకు రూ. 2,500 చొప్పున స్కాలర్‌షిప్స్ అందిస్తున్నట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ రంగాన్ని కూడా ఈ కోర్సుల్లో చేర్చామని, విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'టామ్ కామ్'కు రూ. 90 కోట్లు కేటాయించారని వివరించారు. కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు మంత్రి వివేక్ తెలిపారు. శంషాబాద్, రామగుండం ప్రాంతాల్లో 100 బెడ్ల ఆస్పత్రులు, మహబూబ్‌నగర్‌లో 30 బెడ్ల ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్మికుల పక్షాన నిలబడిన దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) స్మారకార్థం వచ్చే ఏడాది నుంచి 'పీజేఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును అందజేస్తామని ప్రకటించారు. కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల పెన్షన్ పెరిగే వరకు తాను పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. దివంగత నేత 'కాకా' స్ఫూర్తితో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, లేబర్ కమిషనర్ సత్పతి పమేల, హరిచందన, కార్పొరేటర్ విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

**తాగునీటి సమస్య రాకుండా చూడాలి**

**చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల సరఫరా**

**ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు**

**హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,మే 1 :** రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, భారత వాతావరణ శాఖ సంయుక్తంగా రూపొందించిన 'తెలంగాణ స్టేట్ హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్–2026'ను రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. సచివాలయంలో 20 సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 15 వరకు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందన్న ఐఎండీ హెచ్చరికల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వచ్చే 45 రోజుల పాటు రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో మోటార్లు కాలిపోతే 24 గంటల్లోపు మరమ్మతులు పూర్తి చేయాలని, హైదరాబాద్ పౌరుల కోసం రోజుకు 14 గంటల పాటు ఫిల్లింగ్ చేస్తూ 15 వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నల్గొండ, మంచిర్యాల, సూర్యాపేట, పెద్దపల్లి, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యం దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, ప్రత్యేకంగా 'కూల్ వార్డుల'ను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఎండలో పనిచేసే కార్మికులకు ఉపశమనం కలిగించేలా రొటేషన్ పద్ధతిలో గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా పరిశ్రమలకు సూచనలు జారీ చేయాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, ప్రార్థనా స్థలాల వంటి రద్దీ ప్రాంతాల్లో షెల్టర్లు, తాగునీరు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలను ఆదేశించారు. అదేవిధంగా వేసవిలో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్ శాఖలు నిఘా ఉంచాలని సూచించారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా నివేదికలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే, మానవతా దృక్పథంతో వ్యవహరించి తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందేలా చూడాలని స్పష్టం చేశారు. వేసవి జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కవిత భయంతో మేల్కొన్న కేసీఆర్

**కబ్జాలను తొలగిస్తున్న హైడ్రాపై అక్కసా.. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**




**హైదరాబాద్, మే 1:** కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితకు మహేశ్ గౌడ్ థాంక్స్ చెప్పారు. కవిత వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మేల్కొంటున్నారని వ్యాఖ్యానించారు. హైడ్రా గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవుపలికారు. కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. హైడ్రా వల్ల బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సిటీ చుట్టూ ఉన్న చెరువులను ఆ పార్టీ నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. గులాబీ పార్టీ నేతలు ఎందుకు సభలు పెడుతున్నారని పీసీసీ చీఫ్ నిలదీశారు. తాము చేసిన డిక్లరేషన్లు అమలు చేస్తున్నామని.. త్వరలోనే పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితం పదవుల భర్తీపై చర్చించినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# టీఆర్ఎస్‌లో చేరనున్న బోడ జనార్దన్

**పార్టీ అధ్యక్షురాలు కవితతో మాజీమంత్రి భేటీ**



**హైదరాబాద్, మే 1 :** తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ టీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించారు. త్వరలోనే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరబోతున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు బోడ జనార్దన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. సీనియర్ నాయకుడైన ఆయన చేరికతో ఆ ప్రాంతంలో పార్టీకి కొత్త ఉత్సాహం రానుంది. బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉన్న చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తన సత్తా చాటారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు హయాంలో ఆయన కార్మిక శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అనుభవజ్ఞుడైన నాయకుడు పార్టీలో చేరుతుండటంపై టీఆర్ఎస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



సంపాదకీయం

# అప్పుల ఊబిలో తెలుగు రాష్ట్రాలు

## జవాబుదారీతనం ఏదీ?

రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం, అప్పులు తీర్చడం ఎలా అనే ఆలోచన నేడు పాలకుల్లో మృగ్యమవుతోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులను ప్రశ్నించినప్పుడు, అవి 'ఆస్తుల సృష్టి' కోసం చేసినవని సమర్థించుకునేవారు. ఇప్పుడు అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తూ, అంతకు మించిన అప్పులు చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్న విధానాలు కూడా దీనికి భిన్నంగా ఏమీ లేవు. ప్రభుత్వాల ప్రాధాన్యతలు మారకపోతే, మరో వందేళ్లయినా ఈ అప్పుల ఊబి నుంచి బయటపడటం అసాధ్యం.

### ఉచితాల మోత - ఖజానాకు గండి

ప్రస్తుతం రాష్ట్రాల్లో జీతాలు, భత్యాలు ఇవ్వడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొంది. అయినప్పటికీ, ఉచిత పథకాల విషయంలో మాత్రం పాలకులు 'చేతికి ఎముక లేదన్నట్లుగా' ఖజానాను ఖాళీ చేస్తున్నారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందడమే లక్ష్యంగా అభివృద్ధిని పక్కనపెట్టి ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత రేషన్, గ్యాస్, ఇల్లు, బియ్యం, పెన్షన్ వంటి పథకాల వల్ల అసలైన లబ్ధిదారుల కన్నా అనర్హులే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారనేది జగమెరిగిన సత్యం. సంక్షేమం అవసరమే కానీ, అది మోతాదు మించితే దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు సర్వనాశనమవుతాయి. నెలనెలా వడ్డీలకే వేల కోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు సాగడం లేదు.

### రాజకీయ పునరావాసంగా సలహాదారుల పదవులు

ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన సమయంలో, రాజకీయ ప్రాపకం కోసం భారీగా సలహాదారులను నియమించుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో సలహాదారుల వల్ల ఖజానాకు తీవ్ర నష్టం జరుగుతోందని విమర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన హయాంలో సుమారు 14 మందిని సలహాదారులుగా నియమించారు. ఇటీవలే సీనియర్ నేత వి.హనుమంతరావును ప్రభుత్వ సలహాదారుగా, రిటైర్డ్ డీజీపీ శివధర్ రెడ్డిని భద్రతా సలహాదారుగా నియమించి వారికి క్యాబినెట్ హోదా కల్పించారు. క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు సమానంగా ఉన్న ఈ సలహాదారులు అసలు ఏం చేస్తారు? వారు ఏయే విషయాల్లో సలహాలు ఇస్తారో సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు. అప్పులు తెచ్చి మరీ వీరికి లక్షల్లో జీతభత్యాలు, ప్రోటోకాల్ సౌకర్యాలు కల్పించడం ఏ రకమైన పాలన అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. పదవీ విరమణ పొందిన అధికారులకు, రాజకీయ నేతలకు పునరావాసం కల్పించడానికే ఈ పోస్టులను వాడుకుంటున్నట్లు కనిపిస్తోంది.

### మార్గం ఏమిటి?

రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం ఏ పాలకుడికీ లేదు. భూములను తెగనమ్మడం, మద్యం ధరలు పెంచడం, రిజిస్ట్రేషన్ ధరలు పెంచి పరోక్షంగా ప్రజలపై పన్నుల భారం మోపడం కంటే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు పెన్షన్లు రద్దు చేయాలి. సలహాదారుల సంఖ్యను కనీసానికి తగ్గించి, వారి జీతభత్యాలను నియంత్రించాలి. 2047 నాటి ఆర్థిక లక్ష్యాలను అందుకోవాలంటే వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాలను బలోపేతం చేయాలి. వ్యవసాయోత్పత్తులను అనుబంధ రంగాలతో అనుసంధానించడం ద్వారా ఆర్థిక నిచ్చెనను నిర్మించాలి. ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే వస్తువుల విషయంలో సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ వంటి పారదర్శక విధానాలను తీసుకురావాలి, తద్వారా అక్రమాలను అరికట్టి నిధులను ఆదా చేయవచ్చు.

**ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదు, బాధ్యతాయుతమైన పాలన అందించడానికని పాలకులు గుర్తించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యంగా భావించి కఠిన నిర్ణయాలు తీసుకోకపోతే, భవిష్యత్తు తరాలకు ఆర్థిక సంక్షోభాన్ని వారసత్వంగా ఇచ్చినవారవుతారు.**




# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

- 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

**న్యూఢిల్లీ, మే 1:** పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్భందించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.



# గ్యాస్ ధరల పెంపు.. ఎలక్షన్ బిల్లు

- గ్యాస్ ధరల పెంపు.. ఎలక్షన్ బిల్లు
- ధరలపై తాము ముందే చెప్పాం
- పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్ధంగా ఉండాలి
- గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే 1:** దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్-డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు



# పైలట్లకు విశ్రాంతిపై నిబంధనలు బేఖాతరు

- ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆందోళన


**న్యూఢిల్లీ, మే 1:** పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు లేఖ రాసింది. ఇటీవల విధుల్లో ఉండగానే పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో విమాన భద్రత, నియంత్రణ, విమాన సిబ్బంది శ్రేయస్సు వంటి విషయాల్లో ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ.. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించే నిబంధనలను నిరంతరం వాయిదా వేయడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పైలట్స్ అసోసియేషన్ పేర్కొంది. విమానయాన సంస్థలకు నిరంతరం మినహాయింపు లను మంజూరుచేస్తుండడం ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నీరుగార్చిందని తెలిపింది. తాత్కాలిక చర్యలుగా ప్రవేశపెట్టిన ఈ సడలింపుల వల్ల పైలట్లకు విశ్రాంతి ఉండట్లేదని పేర్కొంది. దీనివల్ల వారు మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెంటనే అమలుచేయడానికి మార్గదర్శకాలు రూపొందించాలని డీజీసీఏను కోరింది.




# ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

**రూ.1,745 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం**

**ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా వెల్లడి**



**ముంబయి, మే 1:** ముంబయిలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి.. దానినుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికి గాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా.. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

# పెట్రో ధరలు పెంచడం లేదు

**ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వెల్లడి**

**న్యూఢిల్లీ, మే 1:** దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా ధరలను నియంత్రణలో ఉంచడం గమనార్హం.

# మమతా బెనర్జీపై నిఘా ఉంచాం..

**ఫోటో షేర్ చేసిన సువేందు**

**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఒక ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం రాత్రి నాలుగు గంటల సేపు ఉండటం, తెల్లవారుజామున 12.07 గంటలకు అక్కడి నుంచి వెళ్లిపోవడంపై బీజేపీ నేత సువేందు అధికారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలకు ముందు ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆమె కదలికలపై తాము నిఘా ఉంచినట్టు చెప్పారు. అనుక్షణం ఆమె కదలికను తమ ఏజెంట్ గమనిస్తూ వచ్చినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి భవానీపూర్ స్ట్రాంగ్ రూమ్‌లో మమతా బెనర్జీ ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో ఆయన శుక్రవారం షేర్ చేశారు. 'ఔట్‌గోయింగ్ సీఎం ఎంత ప్రయత్నించినా నిబంధనలు ఉల్లంఘించకుండా మేము అడ్డుకున్నాం' అని సువేందు పేర్కొన్నారు. భవానీపూర్ నియోజక వర్గం నుంచి మమతాబెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీ చేశారు. సఖావత్ మెమోరియల్ స్కూలులో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను మమతాబెనర్జీ గురువారం రాత్రి సందర్శించడంతో హైడ్రామా చోటుచేసుకుంది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు పలు ఫిర్యాదులు వచ్చినందునే తాను స్వయంగా వచ్చినట్టు మమత చెప్పారు. కేంద్ర బలగాలు తొలుత తనను రానీయలేదన్న ఆమె.. అక్కడే నాలుగు గంటల పాటు ఉన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు వస్తూ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ఎలాంటి చర్యలను సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈవీఎంలు దొంగిలించేందుకు, ఓట్ల లెక్కింపులో అవకతవకలు చేసేందుకు ఎవరు ప్రయత్నించినా జీవన్మరణ పోరాటం చేస్తామని అన్నారు. కాగా, ఉత్తర కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను నేతాజీ ఇండోర్ స్టేడియంలో భద్రపరచగా, అక్కడ కూడా టీఎంసీ నేతలు ధర్నాకు దిగారు.



# మల్కాపూర్‌లో రాజరాజేశ్వరుడి ప్రతిష్ఠ!

## వైభవంగా ఆలయ ఉత్సవాలు

**మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజలు**

**ఆధ్యాత్మిక శోభతో పులకించిన మల్కాపూర్**

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

**మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్త పూజలు**


**కొండాపూర్, మే 01 (జనం పవర్):**
మల్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతీ మరకత రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దివ్య ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో, ఆలయ కమిటీ సభ్యుల నిర్వహణలో విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**శాస్త్రోక్త పూజా కార్యక్రమాలు**

మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆవాహిత దేవతాపూజ, ఆవాహిత దేవత హవనం నిర్వహించారు. అష్టోత్తర శత గణపతి పూజ, ద్వారశీర్ష పారాయణం, విశేష మోదక హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. వీటితో పాటు జలాధివాసం, క్షీరాధివాసం వంటి కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. భక్తి సంకీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

**వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ**

మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. ఈ మహోత్సవంలో మల్కాపూర్ భక్తబృందంతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్న భక్తులకు కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



# వడదెబ్బకు వృద్ధుడు బలి!

**పొలంలో పని ముగించుకుని వస్తుండగా అస్వస్థత**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**ఆబాది జమ్మికుంటలో విషాదఛాయలు**



**జమ్మికుంట, మే 01 (జనం పవర్):** వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఆబాది జమ్మికుంటకు చెందిన బొగ్గుల సమ్మయ్య (60) అనే వ్యక్తి వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం పొలంలో పని చేసి ఇంటికి చేరుకున్నాడు. ఎండ తీవ్రత వల్ల అప్పటికే తీవ్ర అస్వస్థతకు గురైన సమ్మయ్య ఒక్కసారిగా కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశాడు. సమ్మయ్య భార్య మూడు ఏళ్ల క్రితమే చనిపోయారు. సమ్మయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఖర్గేతో జుక్కల్ ఎమ్మెల్యే తోట భేటీ!

**కలబురిగిలో ఏఐసీసీ అధ్యక్షుడితో మర్యాదపూర్వక సమావేశం**

**రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చ**

**బుద్ధ పూర్ణిమ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు**



**జుక్కల్, మే 01 (జనం పవర్):** కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగిలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. కలబురిగి పర్యటనలో భాగంగా ఖర్గేను కలిసి ఆత్మీయ సంభాషణ జరిపారు. బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ఖర్గే ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరై పాల్గొన్నట్లు తెలిపారు. ఈ భేటీలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు వంటి వివిధ అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మల్లికార్జున్ ఖర్గే వంటి జాతీయ స్థాయి నాయకుడిని కలుసుకోవడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# జన్నారం విద్యుత్ శాఖ అస్తవ్యస్తం!



## కవ్వాల్‌లో విరిగిన విద్యుత్ స్తంభం

**అంధకారంలో మగ్గుతున్న గ్రామం**

**ఏఈ నిర్లక్ష్యంపై భగ్గుమంటున్న ప్రజలు**

**అప్రకటిత కోతలతో అల్లాడుతున్న జనం**

**మంచిర్యాల జిల్లా జన్నారం మండల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. కవ్వాల్ గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నా ఏఈ పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు అంధకారంలో మగ్గుతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతారాహిత్యం, అప్రకటిత కోతలు, సిబ్బంది మద్యం సేవించి విధులకు హాజరుకావడం వంటి అంశాలపై ప్రజలు మండిపడుతున్నారు. మండుతున్న ఎండల్లో కరెంటు లేక వృద్ధులు, పసిపిల్లలు అల్లాడిపోతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.**

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల విద్యుత్ శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏఈ నుంచి కింది స్థాయి లైన్ మెన్ల వరకు ఎవరూ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏఈకి కనీస అవగాహన లేకపోవడంతో వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల పెద్దలు మండిపడుతున్నారు.

**కవ్వాల్‌లో ప్రమాదం**

శుక్రవారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో కవ్వాల్ గ్రామంలో గడ్డితో వెళ్తున్న ఓ ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్తంభం మధ్యకు విరిగిపోగా విద్యుత్ తీగలు తెగి కిందకు వేలాడుతున్నాయి. దీంతో కవ్వాల్ గ్రామం ఒక్కసారిగా అంధకారంలోకి వెళ్లిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన కరువైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం**



రాత్రి సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది విధులకు గైర్హాజరవుతున్నారు. కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది మద్యం సేవించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇష్టానుసారంగా కరెంటు కోతలు విధిస్తుండటంతో ఎండల తీవ్రతకు పసిపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. రాత్రంతా అంధకారంలో గడపటంతో పాటు తాగునీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే విరిగిపోయిన స్తంభాన్ని సరిచేసి కవ్వాల్ గ్రామంలో విద్యుత్ పునరుద్ధరించాలని కోరుతున్నారు.

# కార్మికుల చెమట చుక్కలే నాగరికతకు పునాది!

**బెజ్జంకిలో ఘనంగా మేడే ఉత్సవాలు**

**ఎనిమిది గంటల పని కోసం చారిత్రాత్మక పోరాటం**

**అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపు**




**బెజ్జంకి, మే 01 (జనం పవర్):** కార్మికుల చెమట చుక్కలే ప్రపంచ నాగరికతకు పునాదులని సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమకు సెలవు లేదని, విజయానికి విశ్రాంతి లేదని పేర్కొన్నారు. ఐక్యత లేని కార్మికులు విడిపూల లాంటివారని, కలిస్తే తిరుగులేని కట్టలాంటి వారన్నారు.

**చికాగో పోరాట స్ఫూర్తి**

1886 సంవత్సరంలో అమెరికాలోని చికాగో పట్టణంలో వేలాదిమంది కార్మికులు ఎనిమిది గంటల పని దినాల కోసం, కనీస వేతనాల కోసం పోరాటాలకు సిద్ధమయ్యారని గుర్తు చేశారు. మే 1న ప్రారంభమైన ఈ పోరాటంలో రాస్తారోకోలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కార్మికులపై కాల్పులు జరిపారన్నారు. ఈ ఘటనలో ఎనిమిది మంది కార్మికులు అమరులయ్యారని తెలిపారు. వారి స్ఫూర్తితో ప్రపంచ కార్మికులు ఐక్యమై సాధించుకున్న హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల పోరాటం ఫలితంగానే అప్పటి ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్, సిపిఎం నాయకులు సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయి కృష్ణ, లింగాల లక్ష్మణ్, గుబిరె మల్లేశం పాల్గొన్నారు. అలాగే దుంబాల రాజమహేందర్ రెడ్డి, గాజె లక్ష్మణ్, కుంట శ్రీనివాస్, దుగ్యాని రాములు, బోనగిరి పరుశరాములు, ఎలుక సంపత్ తో పాటు పలు గ్రామాల కార్మికులు హాజరయ్యారు.



# నిప్పులపాలైన మొక్కజొన్న.. 8 ఎకరాలు దగ్ధం!

**కల్లేపల్లిలో ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు**

**నలుగురు రైతులకు చేతికందిన పంట నాశనం**



**బెజ్జంకి, మే 01 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని కల్లేపల్లి గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఎనిమిది ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ శ్రీకాంత్ వెల్లడించారు. కల్లేపల్లి గ్రామానికి చెందిన చిలుకల కొండాల్ రెడ్డికి చెందిన రెండు ఎకరాలు, చిలకల ప్రతాపరెడ్డికి చెందిన రెండు ఎకరాల పంట అగ్నికి ఆహుతైంది. వీటితో పాటు కేశవరెడ్డికి చెందిన మూడు ఎకరాలు, సుధగోని రాజయ్యకు చెందిన ఒక ఎకరంలో సాగు చేసిన మొక్కజొన్న పంట కాలి బూడిదైంది. కళ్లముందే పంట కాలిపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# విద్యార్థుల విజయమే నా లక్ష్యం!

**పదో తరగతి ఫలితాలపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే**

**టాపర్లకు ఐప్యాడ్‌ల బహుమతి ప్రకటన**

**చిన్నకోడూరు మండలంలో వంద శాతం ఉత్తీర్ణత: మాజీ మంత్రి హరీష్ రావు**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట నియోజకవర్గంలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు గత సంవత్సరం కంటే మెరుగ్గా రావడం పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నదే తన లక్ష్యమని, అందుకోసమే ప్రత్యేక తరగతులు, స్టడీ మెటీరియల్, స్నాక్స్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు గుర్తుచేశారు. ఈసారి మొత్తం 2,874 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 2,791 మంది ఉత్తీర్ణత సాధించారని హరీష్ రావు వివరించారు. సిద్దిపేటలోనే అన్ని రకాల విద్యా సంస్థలను ఏర్పాటు చేసి, పేద విద్యార్థుల కోసం బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్, కస్తూర్బా, మోడల్ స్కూళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్ణయించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. చిన్నకోడూరు మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై హరీష్ రావు హర్షం వ్యక్తం చేశారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నంగునూరు, నారాయణరావుపేట, గ్రామీణ, పట్టణ మండలాల్లో కూడా మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ 30 నుంచి 50 మంది విద్యార్థులకు ఐప్యాడ్‌లు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలకు ప్రోత్సాహక సన్మానాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఇంటర్ లో కూడా ఇదే పట్టుదల కొనసాగించాలని, విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తన కార్యాలయం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.



# స్ప్రింగ్ డయల్ సత్తా!

**పది ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం**

**ఐదు వందల తొంభై ఐదు మార్కులతో సాత్విక టాప్**

**ప్రతిభ చాటిన చాందిని, హర్షిత్**

**క్రమశిక్షణతో కూడిన బోధనే విజయ రహస్యం**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న స్ప్రింగ్ డయల్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన సాత్విక ఐదు వందల తొంభై ఐదు మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలవగా.. చాందిని ఐదు వందల ఎనభై రెండు, హర్షిత్ ఐదు వందల డెబ్బై నాలుగు మార్కులతో అద్భుత విజయం సాధించారు. ఇతర విద్యార్థులు సైతం అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. పిల్లల ప్రదర్శన పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్ రాజమణి పర్యవేక్షణలో క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందించడం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని యాజమాన్యం సూచించింది. పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసి వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేందుకు తమ సంస్థ నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. అద్భుత ఫలితాలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.





# జూన్ 16న బీసీ-ఈ రాష్ట్ర స్థాయి మహాసభ!

- సంచార ముస్లింల హక్కుల సాధనే లక్ష్యం
- రవీంద్రభారతి వేదికగా భారీ ప్రదర్శన
- రిజర్వేషన్లు 10 శాతానికి పెంచాలని డిమాండ్
- చట్టసభల్లో సముచిత స్థానం కోసం పోరు
- కుల ధ్రువీకరణ పత్రాల కోసం జీవో జారీ విన్నపం




**జమ్మికుంట, మే 01 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ-ఈ (సంచార ముస్లిం) వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ, విద్యా, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఈ ఏడాది జూన్ 16న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా భారీ రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహించనున్నారు. హైదరాబాద్ మీడియా సెంటర్ లో జరిగిన సమావేశంలో బీసీ సమాజ్, సంచార సంఘం నాయకులు ఈ మేరకు ప్రకటించారు. గురువారం జరిగిన ఈ కీలక సమావేశంలో రిటైర్డ్ డీజీపీ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు (ఐపీఎస్) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**కీలక డిమాండ్లు**

రాష్ట్ర జనాభాలో ముస్లింలు 13 శాతం ఉన్నప్పటికీ చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని, భవిష్యత్తులో కనీసం 15 మంది ఎమ్మెల్యేలు ఈ వర్గం నుండి ఎన్నికయ్యేలా బలమైన రాజకీయ కార్యాచరణ చేపట్టాలని ఈ సందర్భంగా నేతలు నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 4 శాతం రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన ఏమాత్రం సరిపోవని, దీనిని 10 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో సంచార ముస్లింలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని కోరారు. బీసీ-ఈ వర్గాల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ఈ సమావేశం తీర్మానించింది.

**నేతల పిలుపు**

బీసీ సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు మాట్లాడుతూ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వర్గం నుండి సుమారు 3,000 మందికి పైగా ప్రతినిధులు గెలవడం శుభపరిణామమని, ఇదే స్ఫూర్తిని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు షేర్ అలీ మాట్లాడుతూ బీసీ కుల గణనలో వెనకబాటులో సంచార ముస్లింలు అగ్రస్థానంలో ఉన్నారని, సీబీఐ స్కోర్ 110-111 తో తమ వెనకబాటు స్పష్టంగా తెలిసిపోయిందని అన్నారు. కుల గణన సరిగ్గా చేయలేదని, గారడీ ముస్లింల జనాభాను తక్కువగా చూపించారని రాష్ట్ర ఉపాధ్యక్షులు యాకుబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ సూర్యనారాయణ, రిటైర్డ్ డీఈఓ విజయ్ కుమార్, సంచార ముస్లిం తెగల సంఘం స్థాపకులు ఎండీ షబ్బీర్ వంటి నాయకులు పాల్గొన్నారు. జూన్ 16న జరిగే మహాసభను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుండి సంచార ముస్లింలు కదిలిరావాలని నేతలు పిలుపునిచ్చారు.

# బస్వాపూర్‌లో మిన్నంటిన మేడే వేడుకలు!

- గ్రామంలో ఘనంగా కార్మిక జెండా ఆవిష్కరణ
- శ్రమజీవుల ఐక్యతను చాటిచెప్పిన వైనం
- కార్మికుల హక్కుల కోసం ఐక్యపోరాటమే మార్గం
- హమాలి సంఘం, మేస్త్రీ సంఘం అధ్యక్షులు



**కోహెడ, మే 01 (జనం పవర్):** కోహెడ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా హమాలి సంఘం, మేస్త్రీ సంఘం అధ్యక్షులు సంయుక్తంగా జెండా ఆవిష్కరణ చేసి కార్మికుల ఐక్యతను చాటారు. వివిధ వృత్తులకు చెందిన కార్మికులు, మేస్త్రీలు, హమాలీలు, యువకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేడుకల ప్రారంభంలో కార్మిక అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.

**శ్రమజీవుల పాత్ర కీలకం**

ప్రపంచ కార్మిక ఉద్యమ చరిత్రలో మేడేకు ఉన్న ప్రాధాన్యతను సంఘ నాయకులు ఈ సందర్భంగా వివరించారు. కార్మికుల శ్రమ, చెమటతోనే సమాజ నిర్మాణం జరుగుతుందని, దేశ ఆర్థిక అభివృద్ధిలో శ్రమజీవుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. హక్కుల సాధన, కనీస వేతనాలు, సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వాలు ఆదుకోవాలి**

కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సంఘాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని భరోసా ఇచ్చారు. గ్రామంలోని కార్మిక వర్గాల మధ్య పరస్పర సహకారం, ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొని మేడే సందేశాన్ని బలంగా చాటిచెప్పారు.

# ఓటమి విజయానికి తొలిమెట్టు!

**పదో తరగతి ఫలితాల వేళ విద్యార్థులు ధైర్యంగా ఉండాలి**

**ప్రాణం కంటే మార్కులు ముఖ్యం కాదు**

**తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవద్దు**

**సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

పదో తరగతి ఫలితాలు విడుదలవుతున్న తరుణంలో విద్యార్థులు ఎవరూ అధైర్యపడవద్దని ప్రాణం కంటే మార్కులు ముఖ్యం కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు కీలక సూచనలు చేశారు. పరీక్షల్లో వచ్చిన మార్కులు జీవితాన్ని నిర్ణయించవని ఆమె తెలిపారు. ఫలితం ఏదైనా అది జీవితానికి ముగింపు కాదని తదుపరి విజయానికి మొదటి మెట్టు మాత్రమేనని పేర్కొన్నారు.



**జీవితానికి ముగింపు కాదు**

ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోయినా ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తుకు ప్రాణమే పునాది అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు పిల్లలను ఇతరులతో పోల్చి చిన్నబుచ్చకూడదని వారిపై అనవసర ఒత్తిడి తేవద్దని సూచించారు. ఫలితాల తర్వాత పిల్లలు మౌనంగా ఉండటం లేదా ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నిస్తే వెంటనే వారితో ప్రేమగా మాట్లాడి ధైర్యం చెప్పాలని తెలిపారు.

**పోలీసుల అండ**

ఓటమి తాత్కాలికమని విద్యార్థులకు సిద్దిపేట జిల్లా పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటారని రష్మీ పెరుమాళ్ భరోసా ఇచ్చారు. విద్యార్థులు ఎవరూ ఒంటరిగా లేరని ధైర్యంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. పరీక్షల్లో విఫలమయ్యామన్న బాధతో ఇతర కారణాల వల్ల ఎవరైనా మానసిక ఒత్తిడికి లోనవుతుంటే తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. సమస్య ఏదైనా పరిష్కరించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సహాయం కోసం సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 లేదా డయల్ 100 సంప్రదించాలని కోరారు.




# పదో తరగతిలో కృష్ణవేణి స్కూల్ ప్రభంజనం!

**100 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థుల అద్భుత ప్రతిభ**

**పాఠశాల చైర్మన్ సంగాని రాజు, ప్రిన్సిపల్ రాజేష్**

**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో ముత్తంగి గ్రామానికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాల మొత్తం 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఏడాది మొత్తం 97 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. అందులో 60 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను పెంచారు. పాఠశాల టాపర్‌గా లక్ష్మీ కీర్తన 584 మార్కులు సాధించి నిలిచింది. శృతి 578, శ్రీజ 573, నివృత 573, హరిత 571, వైష్ణవి 570 మార్కులతో మెరిశారు. అలాగే సంజన 563, కీర్తిక 563, హైందవీరెడ్డి 552, రాధాదేవి 548, భార్గవి 547, అమూల్య 545, తిని 541, వేదశ్రీ 541 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. విజేత విద్యార్థులను పాఠశాల చైర్మన్ సంగాని రాజు, ప్రిన్సిపల్ చంద్రిమ్ రాజేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యా ప్రమాణాలు, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థులతో నిరంతర సంభాషణ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపల్ రాజేష్ తెలిపారు. కష్టపడితే విజయం తప్పకుండా లభిస్తుందని, విద్యార్థులు లక్ష్యసాధనలో పట్టుదలగా ఉండాలని చైర్మన్ సంగాని రాజు సూచించారు.

# వేసవి వినోదం విషాదం కావద్దు!

- జలాశయాల వద్ద యువత అప్రమత్తంగా ఉండాలి
- ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని పోలీసుల సూచన
- ప్రమాదాలు జరిగితే వెంటనే డయల్ 100కు కాల్ చేయండి
- జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

వేసవి తాపం తీర్చుకోవడానికి బావులకో, చెరువులకో వెళ్తున్న యువతకు జన్నారం పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. పెరుగుతున్న ఎండలతో జలాశయాల వైపు వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఉదయ్ కిరణ్ సూచించారు. చిన్న అజాగ్రత్త పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని, ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఆయన స్పష్టం చేశారు.



## ముందస్తు జాగ్రత్తలు

చూడటానికి తక్కువ లోతుగా కనిపించే నీటి అడుగున ప్రమాదకరమైన ప్రాంతాలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. లోతు తెలియని ఏ ప్రదేశంలోనూ ఈతకు దిగవద్దని హెచ్చరించారు. ఆపద వస్తే ఆదుకునే తోడు లేకపోవడం వల్లే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఎల్లప్పుడూ స్నేహితుల బృందంతోనే వెళ్లాలని సూచించారు. మద్యం మత్తులో నీటిలోకి దిగడం అత్యంత ప్రమాదకరమని, దీనివల్ల ఊపిరి అందక, స్పృహ తప్పి మునిగిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈత రాని వారు గట్టు వద్దే ఉండటం క్షేమదాయకమని, చిన్నారులు నీటి వద్ద ఆడుకుంటున్నప్పుడు పెద్దలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. హెచ్చరిక బోర్డులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రమాదకరమైన లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే 'డయల్ 100'కు కాల్ చేయాలని జన్నారం పోలీసులు సూచించారు.

# సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ సోదాల కలకలం!

- రూ. 20 వేల లంచం కేసులో బిల్ కలెక్టర్ అరెస్ట్
- రాత్రంతా కార్యాలయంలో అధికారుల తనిఖీలు
- కీలక విభాగాల ఫైళ్లు స్వాధీనం
- ఉన్నతాధికారుల గైర్హాజరుపై అనుమానాలు



**సదాశివపేట, మే 01 (జనం పవర్):** సదాశివపేట మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన తనిఖీలు పెను కలకలం రేపాయి. బిల్ కలెక్టర్ రూ. 20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘటన నేపథ్యంలో అధికారులు మున్సిపల్ కార్యాలయంపై దృష్టి సారించారు. రాత్రి ప్రారంభమైన ఈ సోదాలు తెల్లవారుజాము ఐదు గంటల వరకు కొనసాగాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీఓ) విభాగాలకు సంబంధించిన కీలక పత్రాలు, ఫైళ్లు, రికార్డులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న ఇతర అక్రమాలపై కూడా విచారణ కొనసాగుతోంది.

## అధికారుల గైర్హాజరు

సోదాల అనంతరం శుక్రవారం ఉదయం ఇంజనీరింగ్, టీపీఓ, మేనేజర్ స్థాయి అధికారులు విధులకు హాజరు కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కీలక అధికారులు కార్యాలయానికి రాకపోవడం వెనుక గల కారణాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. కార్యాలయంలో కేవలం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాత్రమే విధులకు హాజరై సాధారణ పనులు నిర్వహిస్తున్నారు. తనిఖీల అనంతరం అధికారులు విధులకు దూరంగా ఉండటం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఏసీబీ అధికారులు ఈ కేసులో మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

# జన్నారంలో ఎర్రదండు నగారా!

### హమాలీల అడ్డాపై ఎగిరిన మేడే జెండా
### దోపిడీ లేని సమాజమే లక్ష్యం
### సీపీఐ ఎం మండల కార్యదర్శి కొండగుర్ల లింగన్న



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం గడ్డపై కార్మిక లోకం మేల్కొంది. హక్కుల పోరాట స్ఫూర్తి నినదించింది. శుక్రవారం మండల కేంద్రం ఎర్రజెండాలతో ఎర్రబారింది. సీపీఐ ఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు పెట్టుబడిదారీ వ్యవస్థపై నిరసన గళంలా సాగాయి. తెలంగాణ చౌరస్తా వద్ద కనికరపు రాజన్న, పోతు శంకర్ స్థూపాలకు నాయకులు నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరిస్తూ కార్మిక వర్గం శపథం చేసింది. ఎఫ్ సీ ఐ గోదాం, బస్టాండ్ సెంటర్, ప్రధాన చౌరస్తాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించి కార్మిక ఐక్యతను చాటారు.

## దోపిడీ లేని సమాజమే లక్ష్యం

చికాగో అమరవీరుల రక్తం వృధా పోనివ్వమని సీపీఐ ఎం మండల కార్యదర్శి కొండగుర్ల లింగన్న స్పష్టం చేశారు. నేటి పెట్టుబడిదారీ సమాజంలో ధనిక వ్యాపారుల దోపిడీ పరాకాష్టకు చేరిందని విమర్శించారు. సామాన్యుల సమస్యలకు పరిష్కారం కావాలన్నా, సమసమాజం ఏర్పడాలన్నా అది సోషలిస్టు వ్యవస్థతోనే సాధ్యమని పేర్కొన్నారు.

తరలివచ్చిన కార్మిక సైన్యం

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూకటికారు బుచ్చయ్య, ఎస్కే అబ్దుల్లా, మహిళా సంఘం నాయకురాలు పోతు విజయ పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నుండి మగ్గిడి జయ, చంద్రన్న, గంగరామ్ హాజరయ్యారు. ఎఫ్ సీ ఐ హమాలీ సంఘం నాయకులు ఆత్రం నగేష్, సోయం రమేష్ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మికులారా ఏకం కండి అన్న నినాదాలతో జన్నారం వీధులు మార్మోగాయి. ఈ మేడే వేడుక మండలంలో కార్మిక ఉద్యమాలకు కొత్త ఊపిరిని పోసింది.



# మల్కాపూర్‌లో ఘనంగా రాజరాజేశ్వర స్వామి ప్రతిష్ఠాపన!

- బొడ్రాయి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వేడుకలు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో శ్రీ పార్వతి మరకత రాజరాజేశ్వర స్వామి దివ్య ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## పూజల్లో ఎమ్మెల్యే

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సంక్షేమం కోసం స్వామివారిని వేడుకున్నారు. ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## ఘన సన్మానం

గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్ పవన్, దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు ఈ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేశారు.



# ఉరివేసుకుని మహిళ అనుమానాస్పద మృతి!

### లక్ష్మీపూర్ గ్రామంలో విషాదం.. భార్య మృతిపై భర్త ఫిర్యాదు
### ఐదుగురిపై విచారణ జరపాలని విన్నపం

**బెజ్జంకి, మే 01 (జనం పవర్):** మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బోనగిరి జనమ్మ (60) గురువారం తన ఇనుప సీటు గదిలో ఇనుప బీముకు చీరతో ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి భర్త బోనగిరి పోశయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. తన భార్య మృతి పట్ల తనకు అనుమానం ఉందని ఆయన పోలీసులకు వివరించారు. పోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన గురువారం ఉదయమే కూలీ పనికి వెళ్లారు. ఉదయం సుమారు 10:55 గంటలకు గ్రామ సర్పంచ్ భర్త తనను పంచాయతీకి పిలిపించినట్లు జనమ్మ ఫోన్ చేసి భర్తకు చెప్పింది. ఈ క్రమంలోనే ఆమె మరణించడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. లక్ష్మీపూర్ కు చెందిన బోనగిరి స్వామి, వసంత, రాజవ్వ, పల్లె బాల్ రెడ్డి, ముక్కిస తిరుపతిరెడ్డిలపై సమగ్ర విచారణ జరిపి మృతికి గల కారణాలు కనుగొనాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం రమేష్ తెలిపారు.

# కెరమెరి రోడ్లపై ఎస్టీ కమిషన్ నజర్!

### అసంపూర్తి రోడ్లపై కమిషన్‌కు ఫిర్యాదు.. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటన
### అధికారులకు నోటీసుల జారీ..
### జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

కెరమెరి మండల గిరిజన గ్రామాల్లోని రహదారి కష్టాలు జాతీయ స్థాయికి చేరాయి. పరండోలి, అనర్పల్లి, లక్మాపూర్ పరిసరాల్లో అసంపూర్తిగా మిగిలిన వంతెనలు, అధ్వానంగా మారిన రోడ్లపై జాతీయ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు అందింది. ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ హైదరాబాద్‌లో కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. వంతెనల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సరైన రహదారి లేక గిరిజనులు పడుతున్న అవస్థలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా తమ రాతలు మారడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల తీవ్రతను గుర్తించిన హుస్సేన్ నాయక్ త్వరలో ప్రభావిత గ్రామాల్లో పర్యటించనున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్, అటవీ, పంచాయతీరాజ్ శాఖలకు 30 రోజుల్లోగా నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. నిబంధనల సాకుతో పనులను ఆపకుండా, గిరిజనుల రవాణా సౌకర్యాల కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను కమిషన్ ఆదేశించే అవకాశం ఉంది. జాతీయ కమిషన్ జోక్యంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వంతెన పనుల్లో కదలిక వస్తుందని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది!

### సంగారెడ్డిలో ఘనంగా మేడే వేడుకలు.. కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ
### భద్రతా నియమాలు పాటించాలని సూచన.. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధికి కార్మికుల పాత్ర అమోఘమని కొనియాడారు. సమాజ నిర్మాణంలో కార్మికులు కీలక శక్తిగా నిలుస్తారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రతి కార్మికుడు గౌరవంతో జీవించేలా అవసరమైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ కార్మికులు తమ పనుల్లో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే వారి రక్షణ కోసం తీసుకునే జాగ్రత్తలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, అవగాహనతో పనిచేస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం కార్యక్రమంలో కొందరు కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు, విద్యార్థులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు భారీ రాయితీ!

**ఫీజుల చెల్లింపుపై 25 శాతం తగ్గింపు**

**మే 1 నుంచి జూలై 31 వరకు అవకాశం**



**జనం పవర్-సిద్దిపేట ప్రతినిధి**

సిద్ధిపేటలోని ప్లాట్ యజమానులకు తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ఫీజుల చెల్లింపుపై 25 శాతం భారీ రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ మేరకు జీవో నంబర్ 131 విడుదల చేసినట్లు కమిషనర్ అశ్రిత్ కుమార్ వెల్లడించారు. ఎల్ఆర్ఎస్ 2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు ఈ సడలింపు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. 2026 మే 1 నుంచి జూలై 31 వరకు మూడు నెలల గడువులో ఫీజులు చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ అందుబాటులో ఉంటుంది. ఈ నిర్ణయం ద్వారా మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా పెద్ద ఊరట లభించడమే కాకుండా.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్లాట్ యజమానులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వేలాది మందికి గణనీయమైన ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని వివరించారు.

# తెలంగాణ జన సమితి ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ!

**ఈ నెల 12న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి ప్లీనరీ**

**విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపు**

**జిల్లా అధ్యక్షులు పాతదొడ్డి తుల్జా రెడ్డి**



**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద తెలంగాణ జన సమితి నాలుగవ రాష్ట్ర ప్లీనరీ పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాతదొడ్డి తుల్జా రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 12న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న ప్లీనరీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మగడంపల్లి ఆశప్ప, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు, నాయకులు పాండు, మల్లారెడ్డి, రాంరెడ్డి, అంజిరెడ్డి, మధు, సురేష్ తదితరులు హాజరయ్యారు.

# రోడ్డుపై చెత్త వేస్తే మీతోనే ఏరిపిస్తాం!

**నిర్లక్ష్యం వహించిన దుకాణదారులకు వినూత్న శిక్ష**

**బహిరంగంగా చెత్త వేస్తే భారీ జరిమానాలు**

**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** పట్టణంలో రోడ్లపై చెత్త వేయొద్దని పలుమార్లు హెచ్చరించినప్పటికీ కొందరు దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మున్సిపల్ అధికారులు వినూత్న చర్యలకు దిగారు. మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్, సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదారులపై పర్యటిస్తూ రోడ్డుపై చెత్త వేసిన దుకాణ యజమానులతోనే ఆ చెత్తను సేకరింపజేశారు. ఆ చెత్తను వారి చేతులతోనే క్యారీ బ్యాగులలో వేయించారు. పట్టణ పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.

## భారీ జరిమానాలు

హెచ్చరికలను పట్టించుకోకుండా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే భారీ జరిమానాలు విధిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని వివరించారు. దీనివల్ల పారిశుధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

## బట్ట సంచులు వాడాలి

వ్యాపారులు, వీధి వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బట్ట సంచులు ఉపయోగించాలని అధికారులు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి వారిపై భారీగా జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. పట్టణ సౌందర్యాన్ని కాపాడేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని స్పష్టం చేశారు.








# కార్మిక హక్కులకు అండ ఎర్రజెండా!

- సిద్దిపేటలో సిఐటియు భారీ బైక్ ర్యాలీ
- కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాట గళం
- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

కార్మిక హక్కులను కాపాడేది ఒక్క ఎర్రజెండానేనని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తా నుండి కార్మిక-కర్షక భవనం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.

## హక్కుల కాలరాత

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఉన్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని మల్లారెడ్డి ఆరోపించారు. దీనివల్ల ఎనిమిది గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన వైఖరి తీసుకోలేదని, గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా హక్కుల పరిరక్షణలో విఫలమైందని విమర్శించారు. రాజకీయ పార్టీలు కేవలం పెట్టుబడిదారుల ప్రయోజనాలకే పనిచేస్తున్నాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కార్మికుల కోసం సిఐటియు ముందుండి పోరాడుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఐక్య ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి, సహాయ కార్యదర్శులు చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి పాల్గొన్నారు. మామిడాల కనకయ్య, ఉపాధ్యక్షుడు కాటం మధు తో పాటు వివిధ యూనియన్ల నాయకులు, కార్మికులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# పొన్నారంలో చలివేంద్రం ప్రారంభం!

**పెరుగుతున్న ఎండల దృష్ట్యా బాటసారుల కోసం ఏర్పాటు**

**దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ ముందడుగు**

**గ్రామ సర్పంచ్ పెంచల మధు**

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీ పరిధిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ పెంచల మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంచాల అమృత రాజలింగు పాల్గొన్నారు. వార్డు సభ్యులు బొజ్జ కుమారి, బోర్లకుంట లక్ష్మణ్ హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి హరీష్, ఫీల్డ్ రవీందర్ రావు పాల్గొన్నారు. గ్రామస్థులు సురిమిల్ల శ్రీనివాస్, నల్లెల్లి ప్రదీప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని చలివేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.

# గృహ కార్మికులను కార్మికులుగా గుర్తించాలి!

**అసంఘటిత రంగ శ్రమజీవులకు సంఘీభావం**

**కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన గళం**

**సామాజిక భద్రత, కనీస వేతనాలు కల్పించాలని డిమాండ్**

**మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్ రెడ్డి**

**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గృహ కార్మికులు, అసంఘటిత రంగంలో శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికి సంఘీభావం తెలుపుతున్నామని మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. వారి కృషి గృహాలను, నగరాలను, దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెడుతున్నప్పటికీ శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ కార్మికులను పక్కనపెట్టి కార్మిక హక్కులను బలహీనపరిచేలా ఉన్న కార్మిక కోడ్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

## ప్రధాన డిమాండ్లు

గృహ కార్మికులను చట్టబద్ధంగా కార్మికులుగా గుర్తించాలని మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. కనీస వేతనాలను నిర్ణయించి వాటిని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. సామాజిక భద్రత, సురక్షిత పని వాతావరణం, గౌరవప్రదమైన ఉపాధి హక్కులు కల్పించాలన్నారు. అన్ని కార్మిక చట్టాలు, సంక్షేమ బోర్డుల్లో వీరిని చేర్చి ఈఎస్ఐ, ప్రసూతి ప్రయోజనాలు, పెన్షన్ వంటి సౌకర్యాలు అందించాలని సూచించారు.

## హక్కుల కోసం పోరాడాలి

కార్మికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు దాతృత్వం కాదని, అది ప్రతి కార్మికుడి న్యాయమైన హక్కు అని ఆయన స్పష్టం చేశారు. కార్మికులందరూ సంఘటితమై తమ స్వరాన్ని బలంగా వినిపించాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని పేర్కొన్నారు. గృహ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలికల కళాశాలకు అరబిందో ఫార్మా వరం!

- జగ్గారెడ్డి వినతితో 17 అదనపు తరగతి గదుల నిర్మాణం
- వెయ్యి మంది విద్యార్థులకు అడ్మిషన్ల అవకాశం
- ఆడిటోరియం ఏర్పాటుకు ఫార్మా సంస్థ చేయూత
- జగ్గారెడ్డి, నిర్మలతో కలిసి భవనాన్ని సందర్శించిన డైరెక్టర్



**సంగారెడ్డి, మే 01 (జనం పవర్):** సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి అరబిందో ఫార్మా మరోసారి తన ఉదారతను చాటుకుంది. గతంలో ఆరు కోట్ల రూపాయలతో వెయ్యి మంది విద్యార్థుల కోసం జీ ప్లస్ వన్ భవనాన్ని నిర్మించిన సంస్థ.. ఇప్పుడు జగ్గారెడ్డి విన్నపంతో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమైంది. కేవలం సంగారెడ్డి నుండే కాకుండా నారాయణఖేడ్, వికారాబాద్, బాన్సువాడ వంటి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సదుపాయాల కొరత వల్ల అడ్మిషన్లు ఇవ్వలేకపోతున్నామని ప్రిన్సిపాల్ సునీత తెలపడంతో జగ్గారెడ్డి వెంటనే స్పందించారు. అరబిందో చైర్మన్ నిత్యానంద రెడ్డిని సంప్రదించి సీఎస్సార్ నిధులు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన సంస్థ 17 అదనపు గదులతో పాటు ఆడిటోరియం షెడ్ నిర్మించేందుకు ముందుకొచ్చింది. జగ్గారెడ్డి, నిర్మలతో కలిసి అరబిందో డైరెక్టర్ సదానంద రెడ్డి కళాశాలను సందర్శించి స్థలాన్ని పరిశీలించారు.

## త్వరలో పనులు ప్రారంభం

కళాశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అరబిందో ప్రతినిధులు వెల్లడించారు. భవన ప్లాన్, అనుమతులు రాగానే త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ అదనపు గదులు అందుబాటులోకి వస్తే మరో వెయ్యి మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించవచ్చని ప్రిన్సిపాల్ సునీత సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి అనంత్ కిషన్, నాయకులు సంతోష్, కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు మహేష్, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# రాజస్థాన్‌పై ఢిల్లీ పంజా!



- పరుగుల వరద పారిన మ్యాచులో క్యాపిటల్స్ ఘనవిజయం
- ఏడు వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ చిత్తు
- వృథా అయిన రియాన్ పరాగ్ మెరుపు ఇన్నింగ్స్
- అదరగొట్టిన రాహుల్, నిస్సంక, స్టార్క్



జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ మైదానం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచులో కఠినమైన భారీ లక్ష్యాన్ని ఢిల్లీ బ్యాటర్లు అలవోకగా ఛేదించారు. రాజస్థాన్ నిర్దేశించిన రెండు వందల ఇరవై ఆరు పరుగుల టార్గెట్ ను పందొమ్మిది పాయింట్ ఒకటి ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే ఏడు వికెట్ల తేడాతో ఢిల్లీ జట్టు జయభేరి మోగించింది.

## రాజస్థాన్ భారీ స్కోరు..

అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. రాజస్థాన్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముఖ్యంగా క్రీజులో పాతుకుపోయిన రియాన్ పరాగ్ కేవలం యాభై బంతుల్లోనే 96 విధ్వంసం సృష్టించాడు. అతనికి జతగా డొనోవన్ ఫెరీరా కేవలం పద్నాలుగు బంతుల్లోనే అజేయంగా నలభై ఏడు పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ధ్రువ్ జురెల్ కూడా ముప్పై బంతుల్లో 42 పరుగులతో మెరుగైన ప్రదర్శన చేశాడు. ఢిల్లీ బౌలర్లలో స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ నాలుగు ఓవర్లలో నలభై పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. అక్షర్ పటేల్ కు ఒక వికెట్, కైల్ జేమీసన్ కు ఒక వికెట్ దక్కాయి.

## లక్ష్యాన్ని కరిగించిన ఓపెనర్లు..

అనంతరం రెండు వందల ఇరవై ఆరు పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు టాప్ ఆర్డర్ బ్యాటర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. కేఎల్ రాహుల్ కేవలం నలభై బంతుల్లో డెబ్బై ఐదు పరుగులు చేసి జట్టు విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు. దానికి తోడు పాతుమ్ నిస్సంక సైతం ముప్పై మూడు బంతుల్లో అరవై రెండు పరుగులతో అద్భుత అర్ధ సెంచరీ సాధించి రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ రాణా కేవలం పదిహేడు బంతుల్లో ముప్పై మూడు పరుగులతో జోరు కొనసాగించి లక్ష్యాన్ని సునాయాసంగా కరిగించాడు. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా (ఒకటి బై ముప్పై మూడు), తుషార్ దేశ్ పాండే (ఒకటి బై ముప్పై ఎనిమిది), జోఫ్రా ఆర్చర్ (ఒకటి బై నలభై ఆరు) తలో వికెట్ మాత్రమే తీసి దారుణంగా నిరాశపరిచారు. ఏ దశలోనూ ఢిల్లీ బ్యాటర్లను నిలువరించలేకపోయిన రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా విఫలం కావడంతో ఆ జట్టుకు సొంతగడ్డపై ఘోర పరాజయం తప్పలేదు.



## దూసుకెళ్తున్న స్వింగ్ మాస్టర్

# భువనేశ్వర్

## జస్ప్రీత్ బుమ్రా రికార్డు బ్రేక్!

టీమిండియా సీనియర్ పేసర్, స్వింగ్ మాస్టర్ భువనేశ్వర్ కుమార్ అరుదైన ఘనత అందుకున్నాడు. భారత్ తరఫున పురుషుల టీ20 క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా గురువారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున బరిలోకి దిగిన భువీ 3 వికెట్స్ పడగొట్టడంతో ఈ రికార్డు అతడి ఖాతాలో చేరింది. ఈ క్రమంలో జస్ప్రీత్ బుమ్రా రికార్డును భువనేశ్వర్ బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ అగ్రస్థానంలో నిలిచాడు. యూజీ 391 వికెట్లు పడగొట్టి టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. తన లెగ్ స్పిన్ మాయాజాలంతో బ్యాటర్లను బోల్తా కొట్టిస్తూ.. మ్యాచ్‌లను మలుపుతిప్పడంలో చహల్ ప్రత్యేక నైపుణ్యం చూపించాడు. యూజీ తర్వాతి స్థానంలో భువనేశ్వర్ కుమార్ ఉన్నాడు. ప్రస్తుతం 350 వికెట్లతో ఉన్న భువీ.. త్వరలోనే ఈ జాబితాలో మరింత పైకి చేరే అవకాశం ఉంది. మూడో స్థానంలో జస్ప్రీత్ బుమ్రా నిలిచాడు. అతడు 347 వికెట్లు సాధించి టీ20ల్లో అత్యంత ప్రభావవంతమైన పేసర్లలో ఒకడిగా నిలిచాడు. పీయూష్ చావ్లా 327 వికెట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. ఐదో స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ 317 వికెట్లతో కొనసాగుతున్నాడు.

### టీ20లలో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు:

# 391 - యుజ్వేంద్ర చహల్
# 350 - భువనేశ్వర్ కుమార్
# 347 - జస్ప్రీత్ బుమ్రా
# 327 - పీయూష్ చావ్లా
# 317 - రవిచంద్రన్ అశ్విన్

# బాబర్ బ్లాస్ట్..

## కోహ్లీ రికార్డులకు సవాల్!

### పీఎస్‌ఎల్ క్వాలిఫైయర్‌లో బాబర్ కెప్టెన్ ఇన్నింగ్స్

### ఒత్తిడిలో సెంచరీతో జల్మీకి ఫైనల్ బెర్త్

### టీ20 కెప్టెన్‌గా కొత్త చరిత్ర సృష్టించిన బాబర్

### కోహ్లీ సరసన మరో అరుదైన ఘనత



పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ మరోసారి తన క్లాస్‌ను నిరూపించాడు. బాబర్-విరాట్ కోహ్లీ పోలికలు ఎప్పుడూ క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగానే ఉంటాయి. ఇప్పుడు మరో అద్భుత ఇన్నింగ్స్‌తో బాబర్ తన పేరు మళ్లీ రికార్డుల పుస్తకాల్లో నిలిపాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్‌పై అద్భుత శతకంతో పెషావర్ జల్మీని ఫైనల్‌కు చేర్చుతూ కెప్టెన్‌గా అసలైన నాయకత్వాన్ని చూపించాడు. కీలకమైన ఈ మ్యాచ్‌లో బాబర్ ఒత్తిడిని ఏమాత్రం పట్టించుకోకుండా 59 బంతుల్లోనే 103 పరుగులు చేసి చెలరేగిపోయాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉండగా.. కరాచీ వంటి కఠినమైన పిచ్‌పై ఈ ప్రదర్శన మరింత ప్రత్యేకమైంది. బాబర్‌కు తోడుగా మహమ్మద్ హారిస్, కుశాల్ మెండిస్, ఆరోన్ హార్డీ వేగంగా ఆడటంతో జల్మీ 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఇస్లామాబాద్ 151 పరుగులకే పరిమితమవడంతో జల్మీ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ సెంచరీతో బాబర్ టీ20 క్రికెట్‌లో కెప్టెన్‌గా అత్యధిక శతకాలు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు 9 సెంచరీలు నమోదు చేసి ఫాఫ్ డుప్లెసిస్ పేరిట ఉన్న 8 శతకాల రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో మైఖేల్ క్లింగర్, విరాట్ కోహ్లీ, జేమ్స్ విన్స్ వంటి స్టార్‌లు అతని వెనుక నిలిచారు. పీఎస్‌ఎల్ చరిత్రలో ఇది బాబర్‌కు నాలుగో సెంచరీ. దీంతో ఉస్మాన్ ఖాన్ పేరిట ఉన్న అత్యధిక శతకాల రికార్డును సమం చేశాడు. ఈ సీజన్‌లో అతని పరుగుల ప్రవాహం చూస్తే ప్రత్యర్థి బౌలర్లకు పెద్ద సవాల్‌గా మారాడు. ఇప్పటికే 588 పరుగులతో ఒకే సీజన్‌లో అత్యధిక పరుగుల రికార్డును కూడా అందుకున్నాడు. ఇక ఒకే దేశంలో 8 టీ20 సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో బాబర్.. విరాట్ కోహ్లీ, అభిషేక్ శర్మల సరసన చేరాడు. తన ఫామ్‌పై స్పందించిన బాబర్.. తాను మళ్లీ పాత రిథమ్‌ను అందుకుంటున్నానని, కష్టాన్ని నమ్మి సాధన చేసిన ఫలితమే ఇప్పుడు కనిపిస్తోందని చెప్పాడు. మొత్తానికి ఈ ఇన్నింగ్స్‌తో బాబర్ ఆజమ్ మరోసారి ప్రపంచ క్రికెట్‌కు తన స్థాయి ఏమిటో చూపించడమే కాకుండా.. కోహ్లీతో పోలికల్లో తన పేరును మరింత బలంగా నిలబెట్టాడు.

# మైదానంలోనే కుస్తీ.. బయట మాత్రం దోస్తీ!



- ఆటలో అగ్రెసివ్.. మ్యాచ్ తర్వాత ఆప్యాయత
- కోహ్లీ-గిల్ బంధం మళ్లీ వైరల్
- గిల్ పోస్ట్‌తో సోషల్ మీడియాలో కొత్త చర్చ
- "ప్లే బోల్డ్"తో ఆర్‌సీబీకి సరదా కౌంటర్
- గెలుపు తర్వాత జీటీ కెప్టెన్‌గా గిల్ సంతృప్తి

క్రికెట్ మైదానంలో ప్రత్యర్థులుగా తలపడినా.. బయట మాత్రం స్నేహానికి కొత్త అర్థం చెప్పే జోడీగా విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ మరోసారి నిలిచారు. గురువారం జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ తర్వాత ఈ ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం మళ్లీ అభిమానుల్లో చర్చనీయాంశమైంది. పోటీలో ఎవరికి వారు గెలవాలనే తపనతో ఆడినా.. మ్యాచ్ ముగిసిన తర్వాత వారి స్నేహం అందరి దృష్టిని ఆకర్షించింది. ఆర్‌సీబీపై గుజరాత్ విజయం సాధించిన అనంతరం గిల్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆర్‌సీబీ ప్రసిద్ధ నినాదం "ప్లే బోల్డ్"ను ఉపయోగిస్తూ.. కోహ్లీ ఫోటోను షేర్ చేయడం అభిమానులను ఆకట్టుకుంది. ఇది ప్రత్యర్థిపై వ్యంగ్యమా.. లేక స్నేహపూర్వక సరదానా అన్న చర్చ సోషల్ మీడియాలో జోరందుకుంది. మ్యాచ్ సమయంలో మాత్రం కోహ్లీ తనదైన అగ్రెసివ్ శైలిని ప్రదర్శించాడు. గిల్ వికెట్ పడగానే కోహ్లీ ఉత్సాహంగా సెలబ్రేట్ చేయడం, ఓ క్యాచ్ వివాదంపై ఫోర్త్ అంపైర్‌తో వాదించడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఆట ముగిసిన తర్వాత ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకోవడం.. మైదానంలోని పోటీ కేవలం ఆటవరకే పరిమితమని మరోసారి స్పష్టం చేసింది. మ్యాచ్ అనంతరం గిల్ తన జట్టు ప్రదర్శనపై ఆనందం వ్యక్తం చేశాడు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన బౌలర్లను ప్రత్యేకంగా అభినందించాడు. ఫీల్డింగ్‌లో గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈసారి ఆటగాళ్లు మెరుగైన శక్తి, ఉత్సాహం చూపించారని ప్రశంసించాడు. తన వ్యక్తిగత బ్యాటింగ్‌పై స్పందిస్తూ.. ఆ రోజు తాను పూర్తిగా ఫోకస్‌లో ఉన్నానని, బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాలనే స్పష్టమైన ఆలోచనతో క్రీజ్‌లోకి దిగానని తెలిపాడు. రాహుల్ తెవాటియా మ్యాచ్‌ను ముగించిన తీరు జట్టుకు విశ్వాసాన్ని పెంచిందని, కొన్ని అదనపు వికెట్లు కోల్పోయినా ప్రతి ఒక్కరికీ అవకాశాలు రావడం సానుకూల అంశమని గిల్ పేర్కొన్నాడు. మొత్తానికి కోహ్లీ-గిల్ మధ్య మైదానంలో పోటీ ఎంత ఉత్కంఠభరితంగా ఉన్నా.. బయట వారి బంధం మాత్రం భారత క్రికెట్‌లో 'కింగ్-ప్రిన్స్' అనుబంధానికి ప్రతీకగా మరోసారి నిలిచింది.



# ఐపీఎల్ రూల్స్‌లో మార్చాల్సిందేనా?

- ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుసగా భారీ స్కోర్లు
- తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న బౌలర్లు
- ఐపీఎల్ నిబంధనల్లో మార్పులు తప్పనిసరి అంటున్న కైఫ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో మ్యాచ్‌ల తరహా పూర్తిగా బ్యాటర్ల ఆధిపత్యంగా మారిపోతుండటంపై మాజీ భారత క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ ఆందోళన వ్యక్తం చేశాడు. వరుసగా జట్లు భారీ స్కోర్లు నమోదు చేస్తుండటంతో బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, ఈ పరిస్థితిని సరిచేయాలంటే టోర్నీ నిబంధనల్లో మార్పులు తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు భారీ స్కోర్లతో ప్రత్యర్థులపై దూసుకెళ్తున్నాయి. 250కి పైగా పరుగులు కూడా సాధారణంగా మారుతున్న వేళ బౌలర్ల పాత్ర క్రమంగా కష్టసాధ్యమవుతోందని కైఫ్ పేర్కొన్నాడు. మొదటి ప్రధాన మార్పుగా అన్ని స్టేడియాల్లో బౌండరీల పరిమాణాన్ని సమానంగా ఉంచాలని సూచించాడు. కొన్ని మైదానాల్లో చిన్న బౌండరీలు ఉండటం వల్ల బ్యాటర్లు సులభంగా సిక్సర్లు బాదుతున్నారని, దీంతో సాధారణ స్కోర్లు కూడా రక్షించలేని పరిస్థితి వస్తోందని చెప్పాడు. 150 నుంచి 170 పరుగుల లక్ష్యాలు కూడా సురక్షితంగా లేకపోవడం బౌలర్లకు తీవ్ర అన్యాయమని అభిప్రాయపడ్డాడు. కాబట్టి పెద్ద బౌండరీలు ఉంటే బౌలర్లకు పోటీతత్వం పెరుగుతుందని సూచించాడు. రెండో కీలక అంశంగా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తొలగించాలని కైఫ్ డిమాండ్ చేశాడు. ఈ నిబంధన కారణంగా జట్లు అదనపు బ్యాటర్‌ను ఉపయోగించుకుని మరింత దూకుడుగా ఆడే అవకాశాన్ని పొందుతున్నాయని, ఫలితంగా బౌలర్ల ప్రాధాన్యం తగ్గిపోతోందని చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ రూల్ లేకపోవడం కూడా దాని ప్రాముఖ్యతపై సందేహాలు పెంచుతోందని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ మరింత



సమతుల్యమైన టోర్నీగా మారాలంటే బ్యాటింగ్‌కు మాత్రమే కాకుండా బౌలింగ్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉండాలని కైఫ్ స్పష్టం చేశాడు. ఇప్పుడు అతని సూచనలపై బీసీసీఐ స్పందిస్తుందా.. భవిష్యత్ సీజన్లలో మార్పులు తీసుకువస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.







# మూడు రోజులు.. మూడు కోట్లు

## 'పెద్ది' ఐటెం సాంగ్‌తో శృతి హాసన్ రచ్చ!

టాలీవుడ్ స్టార్ బ్యూటీ శృతి హాసన్ మరోసారి ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాలో ఆమె ఒక స్పెషల్ సాంగ్‌లో మెరవబోతోందన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీని ఊపేస్తోంది. కేవలం ఈ ఒక్క పాట కోసం శృతి అందుకుంటున్న పారితోషికం వింటే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. సాధారణంగా ఒక హీరోయిన్ పూర్తి స్థాయి సినిమాకు తీసుకునే రెమ్యునరేషన్ కంటే, ఈ స్పెషల్ సాంగ్ కోసమే శృతి భారీగా వసూలు చేస్తోందని సమాచారం. కేవలం 3 నుంచి 4 రోజులు జరిగే ఈ పాట షూటింగ్ కోసం ఆమె ఏకంగా రూ. 3.5 కోట్ల వరకు పారితోషికం అందుకుంటోందన్న ప్రచారం సాగుతోంది. తక్కువ సమయంలోనే ఇంత భారీ మొత్తం అందుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గతంలో రామ్ చరణ్, శృతి హాసన్ కలిసి నటించిన 'ఎవడు' సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో, అదే సెంటిమెంట్‌ను 'పెద్ది' కోసం కూడా ఫాలో అవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. చరణ్ పవర్ ఫుల్ స్టెప్పులు, శృతి గ్లామర్ మరియు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే సంగీతం తోడైతే, ఈ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. మొత్తానికి హీరోయిన్‌గా వరుస అవకాశాలు అందుకుంటూనే, ఇలాంటి స్పెషల్ సాంగ్స్ ద్వారా శృతి హాసన్ తన మార్కెట్ వాల్యూను అమాంతం పెంచేసుకుంటోంది. మరి ఈ క్రేజీ కాంబినేషన్ వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి!



# ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్.. నేహా శర్మ ఎంట్రీ

ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో సబ్‌స్క్రిప్షన్ విధానం విస్తృతంగా ప్రాచుర్యం పొందుతోంది. ప్రత్యేక కంటెంట్ అందిస్తామని చెబుతూ పలువురు నటీమణులు ఈ విధానాన్ని ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు ఈ మార్గాన్ని ఎంచుకోగా, తాజాగా నటీమణి నేహా శర్మ కూడా ఈ జాబితాలో చేరింది. సబ్‌స్క్రిప్షన్ ద్వారా అభిమానులకు ప్రత్యేక ఫోటోలు, వీడియోలు అందిస్తామని పేర్కొంటూ కొందరు ఆకర్షణీయ ప్రకటనలు చేస్తున్నారు. ఈ విధానం యువతలో చర్చనీయాంశంగా మారుతోంది. ఇటీవల విష్ణు ప్రియా ఈ విధానాన్ని ప్రారంభించగా, ఆమెపై వివాదాలు నెలకొన్నాయి. కొన్ని ప్రచారాల నేపథ్యంలో ఆమెపై పోలీస్ కేసు నమోదవడం కూడా జరిగింది. అనంతరం అనన్య నాగళ్ల, అషు రెడ్డి, డింపుల్ హయతి వంటి వారు కూడా సబ్‌స్క్రిప్షన్ సేవలను ప్రారంభించారు. ఇప్పుడు 'చిరుత' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నేహా శర్మ కూడా ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించింది. నెలకు సుమారు రూ. 290 చెల్లిస్తే ప్రత్యేక కంటెంట్ అందిస్తానని ఆమె ప్రకటించింది. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఆమె పోస్ట్ చేసే చిత్రాలకు విశేష స్పందన లభిస్తుండగా, ఈ కొత్త నిర్ణయం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. సోషల్ మీడియాలో అభిమానులతో నేరుగా అనుసంధానం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ విధానం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అయితే ఈ సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్ భవిష్యత్తులో ఎలా మారుతుందన్నది చూడాల్సి ఉంది.





# ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ

'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని.. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.


# బాలయ్యతో సినిమాకు శేఖర్ కమ్ముల యత్నం?

టాలీవుడ్‌లో కొన్ని కాంబినేషన్ల గురించి మొదట వినగానే ఆశ్చర్యంగా అనిపిస్తాయి. కానీ అవి నిజమైతే మాత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు అలాంటి అరుదైన కాంబినేషన్ గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. క్లాస్ సినిమాల దర్శకుడిగా పేరొందిన శేఖర్ కమ్ముల, మాస్ హీరో నందమూరి బాలకృష్ణతో సినిమా చేయబోతున్నారనే వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. శేఖర్ కమ్ముల సినిమాలు అంటే సహజత్వం, భావోద్వేగాలు, సమాజానికి సంబంధించిన అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్' వంటి చిత్రాలతో ఆయన క్లాస్ దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'లీడర్' సినిమా ద్వారా రాజకీయ నేపథ్యంతో కూడిన కథను కూడా బలంగా చూపించారు. మరోవైపు బాలకృష్ణ అంటే హై వోల్టేజ్ యాక్షన్, గంభీరమైన డైలాగ్స్, మాస్ ఎలిమెంట్స్ గుర్తుకొస్తాయి. ఈ ఇద్దరి స్టైల్ పూర్తిగా భిన్నమైనప్పటికీ, అదే ఈ కాంబినేషన్‌పై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల శేఖర్ కమ్ముల కథల ఎంపికలో కొత్త కోణాలను ప్రయత్నిస్తున్నారని టాక్. ఇక బాలయ్య కూడా వరుస విజయాలతో ఫామ్‌లో ఉండటంతో పాటు, కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా సమాజానికి సందేశం ఇచ్చే బలమైన కథలో నటించాలని ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో శేఖర్ కమ్ముల చెప్పిన ఒక పవర్‌ఫుల్ కథాంశం బాలయ్యను ఆకట్టుకుందని చెబుతున్నారు. ఈ సినిమా ఒక పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఇందులో బాలకృష్ణ ఒక వ్యవస్థను ప్రశ్నించే నాయకుడిగా లేదా సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగే పాత్రలో కనిపించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. శేఖర్ కమ్ముల భావోద్వేగాల మేళవింపు, బాలయ్య శక్తివంతమైన తెరపైన ప్రెజెన్స్ కలిస్తే ప్రేక్షకులకు ఒక కొత్త అనుభవం లభించడం ఖాయం అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటిస్తే మాస్, క్లాస్ ప్రేక్షకులిద్దరినీ థియేటర్లకు రప్పించే శక్తి ఈ కాంబోకు ఉందని విశ్లేషకులు అంటున్నారు.



# గందరగోళంలో పడేసేలా.. జెట్లీ మూవీ

మత్తు వదలరా' సిరీస్ చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు రితేశ్ రానా. ఇప్పుడు సత్యతో కలిసి ఆయన రూపొందించిన సినిమా 'జెట్లీ'. ప్రజాపతి (అజయ్) వ్యాపారవేత్త. రూ.15 వేల కోట్ల బ్యాంకింగ్ స్కామ్‌కు పాల్పడి.. దేశం వదిలి దుబాయ్ పారిపోతాడు. దీంతో కేంద్ర హోం మంత్రి మేల్కోటి (శ్రీనివాస్ వడ్లమాని) అతన్ని అరెస్ట్ చేసి తిరిగి దేశానికి రప్పించే బాధ్యతను భారత ఇంటెలిజెన్స్‌కి అప్పజెప్తాడు. అయితే, అప్పటికే జజీరా సిండికేట్‌తో పాటు ఇంకొంత మంది శత్రువుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియడంతో.. ప్రజాపతి స్వయంగా లొంగిపోయినట్లు నటించి, ఆ తర్వాత తప్పించుకోవాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. అతన్ని దుబాయ్ నుంచి కొచ్చికి ప్రత్యేక విమానంలో తీసుకొస్తుండగా.. ఆ స్కామ్‌లో భాగమైన మిగతా వ్యక్తులు తనని చంపేందుకు ఓ ప్రణాళిక రచిస్తారు. ఇలా భారత ఏజెంట్స్ నుంచి తప్పించుకోవాలని ప్రజాపతి.. అతన్ని చంపాలని శత్రువులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆ విమానంలోకి గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్ (సత్య) పాత్ర ఎంట్రీ ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అసలు వేదవ్యాస్ ఎవరు? తన వల్ల ప్రజాపతి ఎస్కేప్ ప్లాన్ ఎలా తలకిందులైంది? ప్రజాపతి శత్రువుల్ని అతనెందుకు అడ్డుకున్నాడు? ఆఖరికి ఆ విమానం సేఫ్‌గా కొచ్చిలో ల్యాండ్ అయిందా? లేదా? ఈ కథలో ఏజెంట్ శివానీ రాయ్ (రియా సింఘా), సినీ సుడోకు ఆడుకునే వెన్నెల కిశోర్ పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. 'మత్తు వదలరా', 'హ్యాపీ బర్త్‌డే' సినిమాలు చూసిన వారికి రితేశ్ కామెడీ స్టైల్,




తన చిత్రాల్లోని పాత్రలు ఎంత గమ్మత్తుగా ఉంటాయన్నది తెలిసే ఉంటుంది. ఈ 'జెట్లీ' కూడా పూర్తిగా అదే మీటర్‌లో సాగే టిపికల్ కామెడీ కథతో.. చిత్రమైన క్యారెక్టరైజేషన్లతో నిండి ఉంటుంది. ఈ కథంతా పూర్తిగా ఓ విమానంలోనే జరుగుతుంటుంది. బ్యాంకింగ్ స్కామ్‌కి పాల్పడిన ఓ బిజినెస్‌మ్యాన్‌ని ప్రాణాలతో చట్టం ముందు నిలబెట్టాలని రా ఏజెంట్స్.. అతన్ని దారిలోనే చంపేయాలని శత్రువులు.. వీళ్లందరి ప్రణాళికల్ని తారుమారు చేసే హీరో పాత్ర.. ఇలా లైన్‌గా చూసినప్పుడు కథంతా ఆసక్తిరేకెత్తించేలా అనిపిస్తుంది. కానీ, రితేశ్ దీన్ని తెరపై ఆవిష్కరించిన తీరే కాస్త గందరగోళంగా అనిపిస్తుంది. ప్రజాపతి పాత్రను.. అతడి బ్యాంకింగ్ స్కామ్‌ను టైటిల్ కార్డ్స్‌తోనే పరిచయం చేసిన దర్శకుడు.. ఆ వెంటనే కథను నేరుగా ఫ్లైట్ ఎక్కించేశాడు. ఇక ఆ విమాన ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఈ సినిమాలోని ఒక్కో పాత్ర నెమ్మదిగా ప్రేక్షకులకు పరిచయమవుతుంటుంది. గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్‌గా సత్య మేల్కొనడం.. తనెవరన్నది అర్థం కాక గందరగోళానికి గురవ్వడం.. ఈ క్రమంలో పండే కన్ఫ్యూజన్ కామెడీ ఆరంభంలో బాగానే అనిపించినా.. ఆ తర్వాత రొటీన్‌గా అనిపిస్తుంది. ఇంటర్వెల్ వరకు కథ అక్కడక్కడే తిరుగుతున్న అనుభూతి కలుగుతుంటుంది. ఈ మధ్యలో సినీ సుడోకు పేరుతో వెన్నెల కిశోర్ చేసే హంగామా.. గుండు సుదర్శన్ బాంబు పేరుతో చేసే హడావుడి.. అంతా బలవంతంగా ఇరికించిన కామెడీ ట్రాక్స్‌లాగే ఉంటాయి. విరామానికి ముందు సత్య పాత్రలోని మరో కోణం బయటకు రావడం.. ఈక్రమంలో వచ్చే ఫ్లైట్ యాక్షన్ సీక్వెన్స్ అలరిస్తాయి. ద్వితీయార్ధంలో కథని ఊహకందని మలుపులతో ట్విస్టీగా నడిపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. కానీ, అది ప్రేక్షకులకు ఏమాత్రం థ్రిల్ పంచదు. ఇక సుదీర్ఘంగా సాగే విమానం హైజాక్ డ్రామా మరింత శిరోభారంగా అనిపిస్తుంది.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA,
PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862,** EDITOR: **BANDARI MARUTHI**